# మంత్రి హరీశ్‌రావుకే మా ఓటు



ఇబ్రహీంనగర్‌లో తీర్మాన పత్రాన్ని బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, ఎంపీపీ మాణిక్యరెడ్డికి అందజేస్తున్న ఎస్సీ మాదిగ సామాజిక వర్గం ప్రజలు

- ముచ్చటగా మూడోసారి కేసీఆర్ సీఎంగా ప్రమాణ స్వీకారం
- పేద ప్రజల ఆశలు నెరవేర్చే బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో
- బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణశర్మ
- ఇబ్రహీంనగర్ ఎస్సీ మాదిగ సామాజిక వర్గం ఏకగ్రీవ తీర్మానం

చిన్నకోడూరు, అక్టోబర్ 29: బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో ప్రజల ఆశలు నెరవేర్చేలా ఉందని బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణశర్మ అన్నారు. మంత్రి తన్నీరు హరీశ్‌రావుకే మా ఓటు వేస్తామని ఇబ్రహీంనగర్ ఎస్సీ మాదిగ సామాజికవర్గం ప్రజలందరూ ఆదివారం ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. తీర్మాన పత్రాన్ని బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి, ఎంపీపీ కూర మాణిక్యరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి హరీశ్‌రావును లక్షా యాభై వేల మెజార్టీతో గెలిపిస్తామన్నారు. సీఎం కేసీఆర్ మ్యానిఫెస్టోను చాలా అద్భుతంగా రూపొందించారన్నారు. మంత్రి హరీశ్‌రావుకే మా ఓటు వేస్తామని దళితులందరూ ఏకగ్రీవంగా తీర్మానం చేయడంతో వారికి ధన్యవాదాలు తెలిపారు. ఎంపీపీ మాట్లాడుతూ మంత్రి హరీశ్‌రావుకు ఓటు వేసి రుణం తీర్చుకోవాలన్నారు. చిన్నకోడూరు మండలాన్ని మంత్రి హరీశ్‌రావు అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపారన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులను ప్రజలు నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా డైరెక్టర్ వెంకటేశం, సొసైటీ చైర్మన్లు కనకరాజు, సదానందంగౌడ్, వైస్ ఎంపీపీ పాపయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుంటయ్య, సర్పంచ్ నెమలి సుభాష్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు ఉమేశ్‌చంద్ర, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు రవీందర్‌రెడ్డి, వైకుంఠం, మధుసూదన్‌రెడ్డి, శ్రావణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎస్సీ మాదిగ సామాజిక వర్గం ప్రజలు

## మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన నాయకులు



ఇబ్రహీంనగర్‌లో మాజీ సర్పంచ్‌ను పరామర్శిస్తున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, ఎంపీపీ మాణిక్యరెడ్డి

చిన్నకోడూరు, అక్టోబర్ 29 : మండలంలోని ఇబ్రహీంనగర్ మాజీ సర్పంచ్ చంద్రాన్ని బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, ఎంపీపీ మాణిక్యరెడ్డి ఆదివారం పరామర్శించారు. ఇటీవల ఆయనకు గుండెనొప్పి రావడంతో దవాఖానకు వెళ్లి చికిత్స అనంతరం ఇంటికి తిరిగి వచ్చారు. విషయాన్ని తెలుసుకొని నాయకులు ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. వారి వెంట మండల నాయకులు తదితరులు ఉన్నారు.

# నేటి నుంచి రాష్ట్రస్థాయి యోగా పోటీలు ప్రారంభం

- విపంచి కళానిలయం, టీచర్స్ భవన్‌లో పోటీల నిర్వహణ
- ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి పన్యాల రామేశ్వర్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌జీఎఫ్ ఆధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి, నిర్వాహకులు

సిద్దిపేట, అక్టోబర్ 29 : సిద్దిపేట జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో ఈ నెల 30 నుంచి విపంచి కళానిలయం, టీచర్స్ భవన్‌లో రాష్ట్రస్థాయి యోగా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి పన్యాల రామేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సిద్దిపేట టీచర్స్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి యోగా క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. అండర్-14,17 విభాగంలో బాల బాలికలకు పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నవంబర్ 1వ తేదీ వరకు పోటీలు నిర్వహిస్తునట్లు తెలిపారు. ఉమ్మడి పది జిల్లాలు నుంచి సుమారు 300మంది క్రీడాకారులు పాల్గొంటారని పేర్కొన్నారు. పోటీల్లో 40మంది శిక్షకులు, మేనేజర్లు, న్యాయనిర్ణేతలు, వ్యాయామ ఉపాధ్యాయులు, వలంటీర్స్ పాల్గొంటారని తెలిపారు. అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి పోటీలను ప్రారంభిస్తారని తెలిపారు.

## రాష్ట్ర టెన్నిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఆసిఫ్ ఎక్బాల్



సిద్దిపేట టౌన్, అక్టోబర్ 29 : రాష్ట్ర టెన్నిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా సిద్దిపేటకు చెందిన సుల్తాన్ ఆసిఫ్ ఎక్బాల్ ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరిగిన అసోసియేషన్ ఎన్నికల్లో ఆయన విజయం సాధించారు. ఎన్నికల అధికారిగా సురేందర్ ఖన్నా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెన్నిస్ క్రీడాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఎన్నికకు సహకారం అందించిన ప్రతిఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్, బీఆర్‌ఎస్వీ నాయకులు

# మంత్రి హరీశ్‌రావుకు పోటీయే లేదు


- లక్షన్నర మెజార్టీ ఖాయం
- బీఆర్‌ఎస్, బీఆర్‌ఎస్వీ నాయకులు

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 29 : సిద్దిపేట నియోజకవర్గంలో మంత్రి హరీశ్‌రావుకు పోటీయే లేదని, ప్రత్యర్థి పార్టీలు కేవలం డిపాజిట్ కోసం మాత్రమే పోటీపడే పరిస్థితి ఉందని బీఆర్‌ఎస్వీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగుల ప్రశాంత్, పీఏసీఎస్ చైర్మన్ చింతల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం సిద్దిపేట అర్బన్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం నిర్వహించి వారు మాట్లాడారు. కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే కనబడే కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. నిత్యం ప్రజల్లో ఉండి ప్రజల కష్టసుఖాల్లో తోడుండే నాయకుడు హరీశ్‌రావుకే మద్దతు ఉంటుందన్నారు. సిద్దిపేట మరోసారి రాష్ట్రంలోనే రికార్డు మెజార్టీ హరీశ్‌రావుకు వస్తుందన్నారు. ఈ ఎన్నికల్లో హరీశ్‌రావు లక్షన్నర ఓట్ల మెజార్టీ వస్తుందని వారు ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు జేపీ యాదవ్, అంకుష్ పాల్గొన్నారు.

# సీఎం కేసీఆర్ సారథ్యంలో మరింత అభివృద్ధి

**బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లింగంగౌడ్**

నంగునూరు, అక్టోబర్ 29 : సీఎం కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ మరింత అభివృద్ధి చెందుతుందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లింగంగౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని శ్రేష్ఠ ఫంక్షన్‌హాల్‌లో ఆయా గ్రామాల కార్యకర్తలతో ముఖ్య సమావేశం నిర్వహించారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడానికి సీఎం కేసీఆర్ చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలే దోహదపడుతాయన్నారు. మంత్రి హరీశ్‌రావుకు ఈ ఎన్నికల్లో మండల వ్యాప్తంగా అధిక మెజార్టీ ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో 100 ఓట్లకు ఒకరిని ఇన్‌చార్జిగా నియమించి, ఎన్నికల సమన్వయ కమిటీలను నియమించినట్లు తెలిపారు. అభివృద్ధికి ఆకర్షితులై ఆయా పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లో పెద్దఎత్తున చేరుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ నుంచి రాంపూర్ గ్రామంలో బీఆర్‌ఎస్‌లో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తడిసిన ఉమ, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి, ఆయిల్‌పామ్ రాష్ట్ర రైతు వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షుడు సోమిరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, సారయ్య, పురేందర్ పాల్గొన్నారు.



కాంగ్రెస్ నాయకులకు గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

# బచ్చాయపల్లికి కొత్తగా పోలింగ్‌స్టేషన్

- 18వ నంబర్ కేటాయింపు
- ఓటర్లు 289 మంది

సిద్దిపేట రూరల్, అక్టోబర్ 29 : సిద్దిపేట రూరల్ మండలంలోని బచ్చాయపల్లి గ్రామం నూతన పంచాయతీగా ఏర్పడింది. అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అధికారులు స్థానిక ప్రాథమిక పాఠశాలలో పోలింగ్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. గతంలో బచ్చాయపల్లి గ్రామంలోని ఓటర్లు రాఘవాపూర్‌లోని పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటును వినియోగించుకునేవారు. ప్రస్తుతం గ్రామంలో ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో మొత్తం 289 మంది ఓటర్లు ఉండగా, ఇందులో పురుషులు 140, మహిళలు 149ఉన్నారు. మరికొన్ని దరఖాస్తులు కొత్తగా వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో మరో రెండు నుంచి ఆరు వరకు ఓట్లు పెరిగే అవకాశం ఉంది. కొత్తగా ఏర్పాటైన పోలింగ్‌స్టేషన్‌లో వృద్ధులు, దివ్యాంగులు ఓటును వినియోగించుకునేందుకు నేరుగా పోలింగ్ కేంద్రం లోపలికి వెళ్లేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ర్యాంపును ఏర్పాటు చేశారు.



సిద్దిపేట రూరల్ : బచ్చాయపల్లిలోని పోలింగ్ కేంద్రం